క్లుప్తంగా

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ జన్మదినం



నెల్లూరు (పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను ఆమె కట్ చేశారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలను సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు తెలియజేశారు.

ఉద్యోగులకు సత్కారం



నెల్లూరు (పొగతోట): ఉత్తమ సేవలను అందించి గణతంత్ర దినోత్సవాన ప్రశంసపత్రాలను అందుకున్న జెడ్పీ యాజమాన్య పరిధిలోని ఉద్యోగులను బుధవారం సత్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రంగడికి బంగారు గరుడసేవ



నెల్లూరు(బృందావనం): తై అమావాస్యను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారికి బంగారు గరుడసేవను బుధవారం నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, వేలూరు శ్రీనివాసులు పర్యవేక్షించారు.

వృద్ధులకు నేత్ర పరీక్షలు




నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ కల్యాణ మండపంలో 70 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు చేసి పింఛన్ల పంపిణీతో పాటు అన్నదానాన్ని బుధవారం నిర్వహించారు. నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నేతలు కప్పిర శ్రీనివాసులు, కప్పిర రేవతి, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొనగళ్ల శోభన్‌బాబు, ఫణీంద్రకుమార్, కోశాధికారి బోగనాథం సుబ్రహ్మణ్యం, పెన్షన్ ప్రోగ్రామ్ చైర్మన్ ఐతా సుబ్బరాయుడు, ఉపాధ్యక్షుడు తిరువీధి కిషోర్, సహాయ కార్యదర్శి చందోలు సతీష్‌కుమార్, సోమిశెట్టి రమేష్‌బాబు, వేల్పూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంటర్వ్యూలు



నెల్లూరు(బారకాసు): నగరంలోని జాఫర్ సాహెబ్ కాలువ నుంచి మైపాడు గేట్ వరకు తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న షాపులకు దరఖాస్తు చేసుకున్న వీధి వ్యాపారులకు ఇంటర్వ్యూలను టౌన్ వెండింగ్ కమిటీ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని అదనపు కమిషనర్ నందన్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంటర్వ్యూలను బుధవారం నిర్వహించారు. గురు, శుక్రవారాల్లోనూ ఇంటర్వ్యూలు జరగనున్నాయని తెలిపారు. టీపీఆర్వో బాలకృష్ణ, మెప్మా పీడీ రాధమ్మ, మదన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ




నెల్లూరు (టౌన్): డ్రైవర్స్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భోజన ప్లేట్లను బుధవారం పంపిణీ చేశారు. ప్లేట్ల విషయమై పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ సమ్రీన్‌కు ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్ తెలియజేశారు. ఈ తరుణంలో వీటిని అందజేశారు. రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌కాక్ సిలాట్‌లో చిచ్చర పిడుగు



తిరువనంతపురంలో నిర్వహించిన పోటీల్లో విజేతగా.. (ఫైల్)



సాధించిన ట్రోఫీతో (ఫైల్)

- సత్తా చూపుతున్న విజయ శ్రీరామకృష్ణారెడ్డి
- రాష్ట్రస్థాయిలో ఐదు, జాతీయ స్థాయిలో రెండు పతకాలు
- గణతంత్ర దినోత్సవాన ప్రశంసపత్రం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మార్షల్ ఆర్ట్స్ పెన్‌కాక్ సిలాట్‌లో నగరానికి చెందిన పదో తరగతి విద్యార్థి విజయ శ్రీరామకృష్ణారెడ్డి ఉత్తమ ప్రతిభ చూపుతున్నారు. చిన్న వయస్సులోనే జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ ప్రదర్శిస్తున్న క్రీడా ప్రతిభ అబ్బురపరుస్తోంది. తాజాగా గణతంత్ర దినోత్సవాన కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు.

కుటుంబమంతా క్రీడాకారులే..

నగరంలోని బుజబుజనెల్లూరులో విజయ శ్రీరామకృష్ణారెడ్డి నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు విజయ్‌భరద్వాజ్‌రెడ్డి, చాముండేశ్వరి క్రీడాకారులే. ఆర్చరీ, పెన్‌కాక్ సిలాట్‌లో తండ్రి.. ఆర్చరీలో తల్లి రాణించారు. సోదరి కృష్ణప్రియ సైతం క్రీడాకారిణే. దీంతో చిన్నతనం నుంచే శ్రీరామకృష్ణారెడ్డికి క్రీడలపై మక్కువ ఏర్పడింది. తండ్రితో కలిసి స్టేడియానికి రావడాన్ని అలవాటు చేసుకున్నారు.

ఐదో తరగతి నుంచే..

దేహదారుఢ్యంతో పాటు పెన్‌కాక్ సిలాట్‌లో మెళకువలు నేర్చుకోవడం ప్రారంభించారు. ఐదో తరగతి నుంచే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనడాన్ని మొదలుపెట్టారు. పాల్గొన్న పోటీల్లో స్వర్ణ పతకాలను సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఐదుసార్లు.. జాతీయ స్థాయి పోటీల్లో రెండుసార్లు స్వర్ణ పతకాలను దక్కించుకున్నారు. వచ్చే ఏడాదిలో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సమాయత్తమవుతున్నారు. తండ్రి వద్ద ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులను సాధించి భవిష్యత్తులో ఎస్ట్రనామికల్ ఇంజినీరింగ్ చేయడమే తమ లక్ష్యమని చెప్పారు.

అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తా

క్రీడల్లో పాల్గొనాలని చిన్నతనం నుంచే ఆసక్తి. పెద్దల ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో రాణించా. రానున్న ఏడాదిలో వరల్డ్ జూనియర్స్ చాంపియన్‌షిప్‌కు సన్నద్ధమవుతున్నా, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పేరు సాధిస్తా.

– విజయ శ్రీరామకృష్ణారెడ్డి

సాధించిన విజయాలు..

- ⇨ ఒంగోలులో 2017, 2018లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సర్ణ పతకాలు.
- ⇨ రాష్ట్రస్థాయిలో 2019లో స్వర్ణ.. నాసిక్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ పోటీల్లో కాంస్య పతకం.
- ⇨ నర్సరావుపేటలో 2021లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం.
- ⇨ నెల్లూరులో 2022లో జరిగిన రాష్ట్రస్థాయి.. కర్ణాటకలోని శివమొగ్గలో నిర్వహించిన సౌత్‌జోన్ పోటీల్లో స్వర్ణ పతకాలు.
- ⇨ పుత్తూరులో 2023లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి.. కేరళలోని తిరువనంతపురం సౌత్‌జోన్ పోటీల్లో స్వర్ణ పతకాలు.. మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం.
- ⇨ శ్రీకాకుళంలో 2024లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి.. పుదుచ్చేరిలో సౌత్‌జోన్ పోటీల్లో స్వర్ణ పతకాలు.. శ్రీనగర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం.

కన్యకాపరమేశ్వరి అగ్నిప్రవేశ మహోత్సవం రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి అగ్నిప్రవేశ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నామని దేవస్థాన పాలకవర్గ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముగరావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను అమ్మవారి సన్నిధిలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు. వసంత పంచమిని పురస్కరించుకొని అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పాలకవర్గ గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి వొమ్మిన జనార్దన్‌రావు, గౌరవ సలహాదారు ఆంజనేయులు, వేముల ప్రసాద్, మునగా వెంకటేశ్వర్లు, పైడా కృష్ణప్రియ, పాటోలు వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



నెల్లూరు (టౌన్): రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా హెల్మెట్‌ధారణపై ద్విచక్ర వాహనదారులకు రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మినీబైపాస్ రోడ్డులో బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం వనంతోపు సర్కిల్లో ఎమ్వీఐ బాలమురళీకృష్ణ మాట్లాడారు. హెల్మెట్‌ను ద్విచక్రవాహనదారులు విధిగా ధరించాలని సూచించారు. మితిమీరిన వేగం, డ్రంకెన్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదన్నారు. ఏఎమ్వీఐలు స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐఓ కార్యాలయ ఎదుట ధర్నా



నెల్లూరు (టౌన్): ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఐఓ కార్యాలయం ఎదుట ధర్నాను బుధవారం చేపట్టారు. ఆర్‌ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం షరీఫ్ మాట్లాడారు. ప్రాక్టికల్స్‌లో మార్కులేయిస్తామని చెప్పి ఎంపీసీ, బైపీసీ విభాగాల విద్యార్థుల నుంచి రూ.600, రూ.1200 మేర వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కిశోర్, నగరాధ్యక్ష, కార్యదర్శి హనీష్, శివం, నేతలు శరణ్, సుధీర్, సిద్ధూ, మౌళి, సోహైల్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్‌లో విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ క్యాలెండర్లను ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి బుధవారం ఆవిష్కరించారు. మీటర్ రీడర్ల సమస్యలు, కోవూరు డివిజన్లో రీడర్లకు మూడు నెలలుగా జీతాల్లేకపోవడం, ఈపీఎఫ్‌ను జమచేయని కాంట్రాక్టర్ రమేష్‌పై చర్యలు చేపట్టాలని యూనియన్ నేతలు కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. ఏఐటీయూసీ కార్యదర్శి శంకర్‌కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి హజరత్‌వలీ, నేతలు కృష్ణ, శ్రావణ్‌కుమార్, హరికృష్ణ, నానీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్సీడీసీ సర్వే పరిశీలన



నెల్లూరు(అర్బన్): జిల్లాలో నిర్వహిస్తున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ సర్వేను ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర వైద్య బృందం బుధవారం పరిశీలించింది. తొలుత జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాత, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ తదితరులతో సమావేశమయ్యారు. లెప్రసీ సర్వేకు సంబంధించిన రికార్డులు, ఆన్‌లైన్ రిపోర్టులను పరిశీలించారు. అనంతరం జీజీహెచ్‌లో కుష్టు వ్యాధిగ్రస్తులకు ఏర్పాటు చేసిన టీహెచ్ వార్డు.. బీవీనగర్‌లోని డీఎఫ్‌ఐటీ కేంద్రంలో కుష్టు రోగులకు జరుగుతున్న పరీక్షలు, చికిత్స సేవలను తనిఖీ చేశారు. సెంట్రల్ లెప్రసీ డివిజనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రంగనాథ్, కన్సల్టెంట్ డాక్టర్ పురోహిత, న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ సురేంద్రబాబు, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ సునీత, డీఏఫ్‌ఐటీ కోఆర్డినేటర్ సతీష్, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, డీపీఎంఓ మోహన్‌రావు, మల్లమ్మ, ప్రసాద్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తై అమావాస్య

నెల్లూరు(బృందావనం): తై అమావాస్యను భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకొన్నారు. నగరంలోని వేమాలశెట్టి, వేమాలమ్మ బావి ప్రాంగణంలో గల వైద్య వీరరాఘవస్వామి దేవస్థానంలో కొలువైన స్వామివారికి విశేష పూజలు చేశారు. కోర్కెలు తీరిన భక్తులు తమ మొక్కులో భాగంగా వేమాలశెట్టి బావిలో బెల్లాన్ని సమర్పించారు. కోర్కెలను నెరవేర్చాలని వైద్యవీరరాఘవస్వామిని మొక్కుకుంటూ ఉప్పు, మిరియాలను సమర్పించారు.

స్తంభించిన ట్రాఫిక్

నెల్లూరు(క్రైమ్): కొండాయపాళెం రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ బుధవారం స్తంభించింది. వాహనాలు బారులుదీరడంతో 108 చిక్కుకుపోయింది. ఐదు, పది నిమిషాల వ్యవధిలో నాలుగు రైళ్ల రాకపోకలు సాగించడంతో 20 నిమిషాల పాటు గేట్‌ను మూసేశారు. దీంతో వనంతోపు, కొండాయపాళెం గేట్ సెంటర్ వరకు వాహనాలు బారులుదీరాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



రైలు సర్వీసుల పెంపునకు వినతి

నెల్లూరు రూరల్: పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని నెల్లూరు – బెంగళూరు మధ్య రైళ్ల సంఖ్యను పెంచాలని బీజేపీ నేత యశ్వంత్‌సింగ్ కోరారు. ఈ మేరకు నెల్లూరు స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రాన్ని బుధవారం సమర్పించారు. పెంచలయ్య, శ్రీనివాసులు, శౌరి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న చర్యలతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు మూతపడనున్నాయని, వీటి పరిరక్షణకు ప్రజలే నడుం బిగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నేత మోహన్‌దాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60 మందికిపైగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చి గ్రామీణ ప్రాంతాల్లో విద్యను వదిలించుకునేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. జీఓ నంబర్ 117ను రద్దు చేస్తామని ప్రకటించి, అదే జీఓలోని విధానాలను అమలు చేయడంలో గల అంతర్యమేమిటని ప్రశ్నించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజన కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలోని శివాజీనగర్, ఎస్సీసీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, డైకస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కేరళలో శిక్షణకు కలెక్టర్

నెల్లూరు(అర్బన్): కేరళలోని ఎర్నాకుళంలో నిర్వహించనున్న ప్రకృతి విపత్తుల శిక్షణకు కలెక్టర్ ఆనంద్ బుధవారం పయనమయ్యారు. నాలుగు రోజుల పాటు జరగనున్న శిక్షణలో ఆయన పాల్గొననున్నారు. అప్పటి వరకు ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ కార్తీక్ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. కాగా ఫిబ్రవరి రెండున ఆయన తిరిగిరానున్నారు.

నగదు పర్సు అపహరణ

నెల్లూరు(క్రైమ్): కర్రల సంచిలో ఉన్న నగదు పర్సును గుర్తుతెలియని దుండగులు అపహరించిన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి జిల్లా కోట మండలం కొత్తపట్నానికి చెందిన లక్ష్మమ్మ తన కుమార్తె వివాహ నిమిత్తం దుస్తుల కొనుగోలుకు గానూ నగరానికి ఈ నెల 11న వచ్చారు. తన కుమార్తె కోసం వీఆర్సీ సెంటర్‌లోని ఓ షాపింగ్ మాల్ బయట వేచి చూడసాగారు. ఈ క్రమంలో ఆమె చేతిలోని కర్రల సంచిని కత్తిరించి అందులో రూ.40 వేలు ఉన్న నగదు పర్సును ఆగంతకులు చోరీ చేశారు. సంచిని కత్తిరించి ఉండటం.. నగదు పర్సు కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వీధి దీపాలను అమర్చాలి



అధికారులకు సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలోని డివిజన్లలో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలను అమర్చి వాటిని క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. 54వ డివిజన్లోని వెంకటేశ్వరపురం, మసీదు సెంటర్, లక్ష్మీ వీధి ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. టిడ్కో గృహ సముదాయ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. టిడ్కో ప్రాంగణంలో మౌలిక వసతులను మెరుగుపర్చడంతో పాటు సచివాలయం, హెల్ప్ డెస్క్, అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. స్థానిక సచివాలయాన్ని టిడ్కో ప్రాంగణంలోకి మార్చేలా చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయం హెడ్ వాటర్ వర్క్స్ స్టోర్స్‌లోని వీధి దీపాలను పరిశీలించారు. ఎంహెచ్‌ఓ చైతన్య, ఇంజినీరింగ్ విభాగ ఈఈ రహంతుజానీ తదితరులు పాల్గొన్నారు.

- పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిరాశ్రయుల కేంద్రాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించి, రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడున్న వారికి సబ్బు, నూనె, ఇతర కాస్మొటిక్స్, దుప్పట్లు, నూతన వస్త్రాలు తదితరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 40 మంది నిరాశ్రయులకు అన్న క్యాంటీన్ల ద్వారా ఆహారాన్ని మూడు పూటలా అందిస్తున్నామని తెలిపారు. ఏర్డీపీడీ నిర్వాహకులు దాసరి సుందరం, మదన్ మిశ్రా, ఎంహెచ్‌ఓ చైతన్య, ఇంజినీరింగ్ విభాగ ఈఈలు రహంతుజానీ, శ్రీనివాసరావు, డీఈఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నెల్లూరు సాకారానికి కృషి

స్వచ్ఛ నెల్లూరు సాకారానికి నిరంతరం కృషి చేయాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ విభాగాధికారులు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటాచలంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ మంజూరైందని, దీనికి గానూ 20 ఎకరాలను గుర్తించామని చెప్పారు. ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యేంత వరకు ఒక ట్రిప్పులో 32 టన్నుల మేర చెత్తను గుంటూరు ప్లాంట్‌కు కాంపాక్టర్‌లో తరలించనున్నామని తెలిపారు. ఎంహెచ్‌ఓ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులపై కఠినంగా వ్యవహరించండి



మాట్లాడుతున్న సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని, కఠినంగా వ్యవహరించాలని నగర డీఎస్పీ సింధుప్రియ ఆదేశించారు. నగరంలోని తన కార్యాలయంలో నగర ఇన్‌స్పెక్టర్లతో నేర సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల పరిష్కారానికి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యాక్టివ్ రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి, తరచూ వారికి కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. జైలు మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేసి జైలు నుంచి విడుదలయ్యే పాత నేరస్తుల వివరాలను సేకరించి నిశిత నిఘా ఉంచాలని చెప్పారు. వ్యాపారులు, అపార్ట్‌మెంట్ వాసులు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు ఇలా అన్ని వర్గాల ప్రజలతో సమావేశాలను నిర్వహించి, సీసీ కెమెరాల ఆవశ్యకతను తెలియజేసి వాటిని ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని కోరారు. ఇన్‌స్పెక్టర్లు కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, దశరథరామారావు, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటర్ పరీక్షలు



మాట్లాడుతున్న ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు రూరల్: ఇంటర్ పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు సూచించారు. ఇంటర్ పరీక్షలపై కలెక్టరేట్లోని తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. అన్ని సెంటర్లలో ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులు సకాలంలో చేరుకునేలా బస్సులను నడపాలని చెప్పారు. అనంతరం ఆర్‌ఐఓ శ్రీనివాసరావు మాట్లాడారు. జిల్లాలోని 141 కేంద్రాల్లో ఇంటర్ ప్రాక్టికల్స్.. 79 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నామని వెల్లడించారు. ఏమైనా సందేహాలుంటే 0861 2320312 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అదనపు కమిషనర్ నందన్, డీఎంహెచ్‌ఓ సుజాత, డీఈఓ బాలాజీరావు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు



మాట్లాడుతున్న గోరటి వెంకన్న

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని ముత్తుకూరు గేట్ సెంటర్‌లో పార్టీ, ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ఎమ్మెల్సీ, కవి గోరటి వెంకన్న మాట్లాడారు. సుందరయ్య, జక్కా వెంకయ్య లాంటి పోరాట యోధులు జన్మించిన ఈ గడ్డపై పార్టీ రాష్ట్ర మహాసభలను నిర్వహించనుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పుల్లయ్య, రంగస్థల నటి రేబాల శ్రీలక్ష్మి, ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్, నేతలు మూలం రమేష్, మోహన్‌రావు, మంగరాజు, కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, కాయల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు సిటీ: బ్యాటరీ ఆటో షోరూమ్‌ను ఇప్పిస్తానని చెప్పి మోసగించిన వ్యక్తిపై నెల్లూరు రూరల్ పోలీసులు చీటింగ్ కేసును నమోదు చేశారు. వివరాలు.. నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకు చెందిన శ్రీనివాసరెడ్డికి అనకాపల్లికి చెందిన సత్యనారాయణ పరిచయమయ్యారు. ఈ క్రమంలో బ్యాటరీ షోరూమ్ ఇప్పిస్తానని నమ్మబలికి శ్రీనివాసరెడ్డి నుంచి రూ.22 లక్షలను వసూలు చేశారు. అయితే షోరూమ్‌ను ఇప్పించకపోవడం, నగదును ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సాహితీ స్రవంతి' సేవలు ప్రశంసనీయం



నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్ కళాశాల మైదానంలో జన కవనం కార్యక్రమాన్ని సాహితీ స్రవంతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. భాషా, సాహిత్యానికి జీవం పోయాలనే సంకల్పంతో సాహితీ స్రవంతి సంస్థ కార్యక్రమాన్ని చేపట్టడాన్ని అభినందించారు. అనంతరం 50 మందికిపైగా కవులు తమ కవితలను వినిపించారు. కాబోయే కథకులకు పనికొచ్చే చిట్కాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవి ఈతకోట సుబ్బారావు, చెలంచర్ల భాస్కర్‌రెడ్డి, లక్ష్మయ్య, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి గోపీనాథ్ పాల్గొన్నారు.

హెచ్చరిక నోటీసు

మా కక్షిదారైన **శ్రీమతి రావిపాటి క్యాథ్లీన పీటర్జి W/o జయకుమార్ రెడ్డి**, అమ్మా హోమ్స్, శాంతినగర్, డైకస్ రోడ్డు, నెల్లూరు సిటీ వాస్తవ్యురాలు, వారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో IA No.514/2023 ; O.S.No.75/2023** కేసు నందు **శ్రీమతి వెల్లంపల్లి వరలక్ష్మి W/o కరిముల్లా** గారి నుండి రావలసిన **ప్రోనోటు బాకీ**కి గాను **అటాచ్‌మెంటు బిఫోర్ జడ్జిమెంటు** ద్వారా జప్తు చేయబడి సదరు **కేసు పెండింగులో** వున్నది. సదరు విషయం కప్పిపుచ్చి యితరులను మభ్యపెట్టుచూ తన అనుచరుడైన **షేక్ మస్తాన్ షరీఫ్ కుమారుడైన షేక్ మొహమ్మద్ అలి** అనునతని పేరుతో తప్పుడు డాక్యుమెంటును సృష్టించి యితరులకు అన్యాక్రాంతము చేయ బోవుచున్నట్లు మా కక్షిదారునికి రూఢీగా తెలియుచున్నది. అట్లు యెవరైనను ఆమె మాయమాటలకు లోబడి సదరు ఆస్తిపై యెటువంటి లావాదేవీలు జరుపుటకు ప్రయత్నించిన అట్టివి ఎంతమాత్రము చెల్లనేరవు మరియు అట్టి పత్రములు మా కక్షిదారునిపై ఎంత మాత్రము బద్ధిగించవని యిందుమూలముగా తెలియజేయడమైనది. అట్టి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొనబడునని యిందుమూలముగా హెచ్చరించడమైనది.

ఆస్తి షెడ్యూలు

నెల్లూరు జిల్లా, నెల్లూరు సబ్ రిజిస్ట్రారు యేరియాలోని, నెల్లూరు సిటీ, నెల్లూరు మునిసిపల్ లిమిట్స్, అంబాపురంలోని దొర నెం. 20/1-B, స.నెం. 109/2, ప్లాను దాఖలా ప్లాటు నం.05, 26 అంకణములా 13 చ॥ అడుగుల స్థలం అందులో కట్టబడియున్న అసెస్‌మెంటు నం. 1031114936 రు గల RCC మిద్దె యిల్లు 20 అంకణములు గ్రౌండు ఫ్లోరు, 07 అంకణముల ఫస్ట్ ఫ్లోరు, కరెంటు సర్వీసులతో సహా యిందుకు **హద్దులు :- తూర్పు**: 20 అడుగుల లేఅవుట్ రోడ్డు, **దక్షిణం** : 4 నంబరు ప్లాటు, **పడమర** : కర్నాటి బ్రహ్మారెడ్డి గారి ఆస్తి, **ఉత్తరం** : 6 నంబరు ప్లాటు. అన్ని హక్కులతో సహా.

Countersigned by
R. క్యాథ్లీన పీటర్జి

K.రఘునాథరెడ్డి, B.Com., B.L.,
అడ్వకేటు, టెక్కేమిట్ట, నెల్లూరు-3.
సెల్: 99636 52426